గమనిక:
సాహిత్య పేజీ 'చెలిమె' ఇకపై ఆదివారానికి బదులు సోమవారం ప్రచురితమవుతుంది.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

పార్లమెంటులో ప్రశ్నించే గొంతుక బీఆర్ఎస్

బోయినపల్లి వినోద్ కుమార్

దేశంలో నెల రోజుల్లో సాధారణ ఎన్నికలు జరుగబోతున్నాయి. రాజకీయ పార్టీలన్నీ సమర సన్నాహాల్లో మునిగి ఉన్నాయి. తమ మంద, ధన, కండ బలంతో ఓట్లను దండుకునేందుకు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నాయి. వాగ్దానాలకు పదునుపెట్టి ప్రజలపై వదులుతున్నాయి. ఆ క్రమంలోనే జాతీయ పార్టీలుగా చెప్పుకొంటున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పోటాపోటీగా హామీలు గుప్పిస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు తంటాలు పడుతున్నాయి.

వికసిత్ భారత్ పేరుతో, ఫిర్ ఏక్ బార్ మోదీ పేరుతో ప్రజలను ఏమార్చేందుకు బీజేపీ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నది. సమర్థ నాయకత్వం చేతిలోనే దేశం భద్రంగా పటిష్టంగా ఉంటుందని చెప్తూ, ఆ అర్థంలో మోదీకి ఎదురేలేదని ఆర్ఎస్ఎస్, సంఘ్‌పరివార్ శ్రేణులు నమ్మబలుకుతున్నాయి. గత పదేండ్లుగా అధికారంలో ఉన్న మోదీ ఏం సాధించారో, దేశ ప్రజలకు ఉన్న మౌలిక సమస్యలను వేటిని పరిష్కరించారో చెప్పటం లేదు. వికసిత్ భారత్ పేరుతో ప్రజలను మరోమారు వంచించటానికి ముందుకు వస్తున్నారు. ఈ పదేండ్ల మోదీ పాలన 'వికసిత భారత్'లో నిరుద్యోగం భయంకర స్థాయికి చేరుకున్నది. ఇది ఎవరో పాలకపక్షాన్ని విమర్శిస్తూ విపక్షం అన్న మాట కాదు. ఈ చేదు నిజం కేంద్ర ప్రభుత్వానికి చెందిన స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ మంత్రిత్వశాఖ తాజాగా వెల్లడించిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్)లో బహిర్గతమైంది. ఆ అధ్యయనం ప్రకారం.. దేశంలో 15 ఏండ్లు, అంతకంటే ఎక్కువ వయసు కలిగిన గ్రాడ్యుయేట్లలో 13.4 శాతం మంది నిరుద్యోగంలో మగ్గుతున్నారు. ఈ సర్వే ఫీల్డ్ వర్క్ జూన్ 2022 నుంచి జులై 2023 మధ్య జరిగింది.

పదేండ్ల మోదీ ఏలుబడిలో దేశం నిరుద్యోగ భారతాన్ని ఆవిష్కరించిందనడానికి ఇంతకంటే వేరే సాక్ష్యాధారాలు అవసరం లేదు. ఈ కాలంలో నిరుద్యోగ సమస్య ఆందోళనకర స్థాయికి చేరిందని పలు అధ్యయనాలు ఘోషిస్తున్నాయి. కార్పొరేట్ దిగ్గజాల్లో ఒకరైన అజీం ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం ఈ మధ్య విడుదల చేసిన సర్వే ప్రకారం.. దేశంలో 25 ఏండ్ల లోపు గ్రాడ్యుయేట్లలో 42.3 శాతం నిరుద్యోగులేనని తేల్చింది. ఉన్నత, మాధ్యమిక విద్య పూర్తి చేసిన వారిలో 21.4 శాతం మంది నిరుద్యోగులే. ప్రపంచ ఆర్థిక మాంద్యం వచ్చిన 2008 నుంచి చూసుకుంటే కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక నిరుద్యోగిత రేటు పెరిగిందని నేషనల్ శాంపిల్ సర్వే కుండబద్దలు కొట్టింది. 2023 అక్టోబర్‌లో నిరుద్యోగిత రేటు 10.05 శాతానికి చేరింది. ఇదీ బీజేపీ పాలనలో దేశం వెలిగిపోతున్న తీరు!

ప్రధాని అభ్యర్థిగా 2014 ఎన్నికల్లో యువతకు మోదీ ఇచ్చిన హామీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు. కానీ, తొమ్మిదిన్నరేండ్లలో ఉద్యోగాల భర్తీ ఊసే లేదు. కాకపోగా ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేయటం, పెట్టుబడుల ఉపసంహరణ పేరుతో ఉన్న ఉద్యోగాలనే ఊడబెరికారు. ఈ పదేండ్ల మోదీ పాలనలో రెండు కోట్ల ఉద్యోగాలు పోయాయి. స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా నినాదాలు గాలిలో కలిసిపోయాయి. చివరికి ఎక్కడిదాకా వచ్చిందంటే, విధిలేక వీధుల వెంట పకోడీలు అమ్ముకునే పని కూడా ఉపాధి, ఉద్యోగం కిందికే వస్తుందనే స్థాయికి బీజేపీ పెద్దలు భాష్యాలు చెప్తున్నారు. ఇది నిరుద్యోగులను అపహాస్యం చేయడమే. ఇప్పటివరకు రైతుల, వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యల గురించే విన్నాం. ప్రస్తుతం నిరుద్యోగుల ఆత్మహత్యలూ సంభవిస్తున్నాయని నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో గణాంకాలు తెలుపుతున్నాయి. దేశాన్ని ముందుకు నడిపించాల్సిన యువత ఉపాధి లేక నిరాశ నిస్పృహలతో బలవన్మరణాలకు పాల్పడటం సమాజానికి చేటు. దేశ జనాభాలో 35 ఏండ్ల లోపు యువత 66 శాతం ఉంటుందని ఒక అంచనా. కోట్లాదిగా ఉన్న వీరికి ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేవు. బీజేపీ ప్రచారం చేసుకుంటున్న 'అచ్చేదిన్' అంటే ఇదేనా?

> మరోవైపు మోదీ, బీజేపీ నేతలు డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ గప్పాలు పలుకుతారు. అంటే కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాలే ఉంటే అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని చెప్తున్నారు. ఆ పేరుతో ప్రజలను వంచించి ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటుచేశారు. ప్రాంతీయ పార్టీల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాల్లో అధికారం చేజిక్కించుకునేందుకు డబుల్ ఇంజిన్ సర్కార్ అనే దాన్నే ప్రధాన నినాదంగా చేసి బీజేపీ పబ్బం గడుపుకొంటున్నది. నిజానికి డబుల్ ఇంజిన్ సర్కార్ పేరుతో బీజేపీ, మోదీ చేసిన, చేస్తున్న అభివృద్ధి చూస్తే బీజేపీ నేతలు చేస్తున్న ప్రచారం ఎంత బూటకమో తేట తెల్లమవుతుంది.

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నీతి ఆయోగ్ చేపట్టిన మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ (ఎంపీఐ) అధ్యయనం ప్రకారం... డబుల్ ఇంజిన్ సర్కార్ పేరుతో వరుస విజయాలు సాధిస్తున్న బీజేపీ పాలనలోని ఉత్తరప్రదేశ్ అన్ని రంగాల్లో దిగజారింది. పేదరికంలో దేశంలోనే కడు పేద రాష్ట్రాల్లో మూడో స్థానంలో నిలిచింది. మొదటి స్థానంలో బీహార్, రెండో స్థానంలో జార్ఖండ్ ఉన్నది. అంతేకాదు, పోషకాహార లోపంలోనూ, గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య సేవలు అందటంలోనూ బీజేపీ పాలనలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు కడు దయనీయ స్థితిలో ఉన్నాయి. అంతెందుకు దేశానికే రోల్ మోడల్ అని ప్రగల్భాలు పలుకుతున్న గుజరాత్‌లో ప్రాథమిక విద్య ఎంత అధ్వాన్న స్థితిలో ఉన్నదో ఇటీవలి పదో తరగతి ఫలితాలు వెల్లడి చేశాయి. గుజరాత్‌లో 157 పాఠశాలల్లో పదో తరగతిలో జీరో శాతం రిజల్ట్ వచ్చింది! ఇదీ మోదీజీ ఆదర్శ రాష్ట్రంలోని విద్యా ప్రగతి. ఇలా చెప్పుకొంటూపోతే.. బీజేపీ పాలిత రాష్ట్రాలు మిగతా రాష్ట్రాలతో పోలిస్తే అట్టడుగున ఉన్నాయి. అలాగే దేశం విషయానికి వస్తే.. మోదీ అసమర్థ, అవినీతి పాలన గురించి ఎంత తక్కువ చెప్పుకొంటే అంత మంచిది.

దేశం వెలిగిపోతున్నదనీ, అందరికి అభివృద్ధి-అందరికి వికాసం అని చెప్తున్న మోదీ పాలనలో ప్రభుత్వ లెక్కల ప్రకారమే పేదరికం, నిరుద్యోగం పెరిగిపోయింది. తన పాలనలో 20 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చామని మోదీ చెప్తున్నా... మరోవైపు 80 కోట్ల మందికి ఆహారభద్రత కార్డులతో ఆహారం అందిస్తున్నారనే నిజాన్ని దాస్తున్నారు. అంటే దేశ జనాభాలో సగానికంటే ఎక్కువ మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని ప్రభుత్వం చెప్పకనే చెప్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో 'వికసిత భారత్' ఎలా అవుతుందో మోదీ భజనపరులే చెప్పాలె. అంతేకాదు, దేశం మునుపెన్నడూ లేని స్థాయిలో అప్పుల కుప్పయ్యింది. 2014 దాకా దేశాన్నేలిన 14 మంది ప్రధానులు చేసిన అప్పు రూ.50 లక్షల కోట్లు అయితే, మోదీ పదేండ్ల కాలంలో అది రూ.150 లక్షల కోట్లు దాటింది. ఇదిలా ఉంటే.. మోదీ పాలనలో కోటీశ్వరులు మరింత కుబేరులై పోతే, పేదలు మరింతగా కడు పేదరికంలోకి దిగజారిపోతున్నారు. మోదీ చెప్తున్న 'వికసిత్ భారత్' అంటే అంబానీ, అదానీల భారత్ అని అర్థమేమో బీజేపీ నేతలే చెప్పాలి. దేశ సంపదను, సహజ వనరులను కొద్దిమంది అంబానీ, అదానీ లాంటి కోటీశ్వరుల పరం చేయటం, ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేయటమే వికసిత్ భారత్. ఓడరేవులను, విమానాశ్రయాలను సైతం ప్రైవేటు కంపెనీలకు అప్పజెప్పటం లాంటి చర్యలతో మోదీ దేశాన్ని బడా కార్పొరేట్ కంపెనీలకు అమ్మేస్తున్నారు. ఈ నేపథ్యంలో చూస్తే... దేశంలో మోదీది విధ్వంస పాలన, విద్రోహ పాలన. ఆ అర్థంలో మోదీ పెద్ద మోసగాడు. ఈ నేపథ్యంలో బీజేపీకి గానీ, మోదీకి గానీ దేశ ప్రజల ముందుకు వచ్చి ఓట్లు అడిగే నైతిక హక్కు లేనే లేదు.

ఇక కాంగ్రెస్ విషయానికి వస్తే.. తగదునమ్మా అంటూ మోదీ విధ్వంసక, విభజన రాజకీయాలను విమర్శిస్తూ కాంగ్రెస్ ముందుకు వస్తున్నది. రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర' చేస్తూ.. సమాజాన్ని కులం, మతం పేరిట విభజన రాజకీయలు చేసే విషపూరిత భావజాలమని బీజేపీని విమర్శించారు. ప్రేమను పంచుతూ.., ప్రజలను ఏకం చేసే పార్టీ కాంగ్రెస్ అని చెప్పుకొంటున్నారు. గత ఆరున్నర దశాబ్దాలుగా దేశాన్ని అన్నివిధాలా నాశనం చేసిన పార్టీగా కాంగ్రెస్ పాపాన్ని మూటగట్టుకున్నది. తాజాగా ఇప్పుడు తామేదో చెస్తామని చెప్పటం ప్రజలను మాయమాటలతో ప్రలోభ పెట్టడమే. దేశానికి ఐదు గ్యారెంటీలు, విషయ, సమస్యపరంగా 25 గ్యారెంటీలతో కాంగ్రెస్ అలవికాని హామీలతో ప్రజల ఓట్లను కొల్లగొట్టేందుకు తంటాలు పడుతున్నది. కానీ గత చరిత్రను చూసిన ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మి మరోసారి మోసపోవద్దని సవినయంగా విజ్ఞప్తి చేస్తున్నాను.

ప్రధానంగా జాతీయ పార్టీలుగా చెప్పుకొంటూ ప్రజల ముందుకువస్తున్న బీజేపీ, కాంగ్రెస్ రెండూ ప్రజా వ్యతిరేక పార్టీలే. దేశ ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధి లేని పార్టీలే. కాబట్టి తెలంగాణ ప్రజలు సుదీర్ఘ పోరాటాలతో, అనన్య త్యాగాలతో రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ వైపే చూస్తున్నారు. గత పదేండ్లలో రాష్ట్ర అవతరణ తర్వాత రాష్ట్రంలో తాగు, సాగునీటి సమస్యలు మొదలు అనేక మౌలిక సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ఎంతటి విప్లవాత్మక నిర్ణయాలతో, ఆచరణతో ముందుకు పోయిందో అందరికీ అనుభవమే. అన్నింటా దేశంలోనే తెలంగాణను అగ్రభాగాన నిలిపిన బీఆర్ఎస్ మాత్రమే తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చే పార్టీగా ప్రజలు గుర్తిస్తున్నారు, ఆదరిస్తున్నారు. ఈ నేపథ్యంలో... రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలోని అన్ని పార్లమెంటరీ స్థానాల్లో బీఆర్ఎస్‌కే ఓటు వేసి గెలిపించి తెలంగాణ అస్తిత్వ చైతన్యాన్ని చాటాలని మిమ్మల్ని కోరుతున్నాను.

(వ్యాసకర్త: మాజీ ఎంపీ, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షులు)

జెండాలూపిన మేధావులెక్కడ?

టంకశాల అశోక్

> ఇది అది అని గాక ఏ ప్రభుత్వం చేసే తప్పులనైనా ఎత్తిచూపటం, ప్రజల మేలు కోసం ఏమి జరగాలో సూచించటం మేధావుల బాధ్యత. పదేండ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఏమి సూచనలు చేశారో తెలియదు గాని, తప్పులను విమర్శించే బాధ్యతను మాత్రం కొందరు మేధావులు బాగానే నిర్వర్తించారు. అంతవరకు కూడా ఆహ్వానించదగినదే. తర్వాత అసెంబ్లీ ఎన్నికల సమయంలో వారు ఒక అడుగు ముందుకువేసి కాంగ్రెస్ ప్రచార రథాలకు ఉత్సాహంగా జెండాలూపారు. అందులో ఆక్షేపించవలసింది కూడా ఏమీ లేదు. ఆ పార్టీ అధికారానికి వచ్చినట్టయితే అంతవరకు జరిగిన తప్పులు జరగబోవని, ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని వారు నిజంగానే నమ్మి ఉండవచ్చు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన గత నాలుగు మాసాలలో ఏమి జరుగుతూ వస్తున్నదో వారెపుడైనా సమీక్షించారా? వంద రోజుల గడువు పెట్టిన ఆరు గ్యారెంటీల విషయంలో గాని, ఇతరత్రా క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న మంచి చెడులపైగాని వారి మధ్య చర్చలేమైనా సాగుతున్నాయా? అన్నవి మన ముందుకు వస్తున్న ప్రశ్నలు. ఇందుకు సమాధానాలు కనీసం బయటకైతే ఏమీ కన్పించటం లేదు.

ఇక్కడ ఉద్దేశిస్తున్న మేధావులు జెండాలూపిన సందర్భాన్ని ముందుగా చూద్దాము. అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో కొందరు నిరుద్యోగులు బస్సులలో తెలంగాణలోని పలు ప్రాంతాలకు వెళ్లి బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా తీవ్రమైన ప్రచారం జరిపారు. ఆ ఖర్చులన్నింటినీ భరించింది కాంగ్రెస్ పార్టీ అనే అభిప్రాయం అందరికీ కలిగింది. ఆ విధంగా సారాంశంలో మేధావులు జెండాలూపింది కాంగ్రెస్ ప్రచార రథాలకన్న మాట. అందువల్లనే, పౌర హక్కుల రంగంలో గల ఒక ప్రముఖ సంస్థ, మేధావులు ఆ విధంగా ఒక పరిధిని దాటడం సరికాదని భావించి వారి ఈ విధమైన కార్యకలాపాలకు దూరంగా ఉండిపోయింది. అయినప్పటికీ, ఒక వేళ కొత్త ప్రభుత్వంలో నిరుద్యోగులకు మేలు జరిగి ఉంటే దీనినంతా ఉపేక్షించవచ్చు. కాని జరుగుతున్నదేమిటి?

అధికారానికి వచ్చిన ఏడాది కాలంలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయగలమన్నది కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీ. ఏడాది కాలం 2024 డిసెంబర్ మొదటి వారానికి పూర్తవుతుంది. ఇప్పటికి గడిచిన నాలుగు నెలల కాలంలో జరిగిందేమిటి? బీఆర్ఎస్ ప్రభుత్వమే నోటిఫికేషన్లు ఇచ్చి పరిపాలనా ప్రక్రియ పూర్తయి ఎన్నికల కోడ్ వల్ల ఆగిన 30,000 ఉద్యోగాలకు కేవలం నియామక పత్రాలిచ్చి, ఆ ఉద్యోగాలను తామే ఇచ్చినట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి కొద్దిరోజుల క్రితం హైదరాబాద్ వచ్చిన రాహుల్‌గాంధీ వరకు అందరూ చెప్తున్నారు. ఈ మాట నిజం కాదని, అవన్నీ బీఆర్ఎస్ నోటిఫికేషన్లని, కొత్త ప్రభుత్వం ఇచ్చింది ఒక్కటైనా లేదని స్వయంగా నిరుద్యోగులు, వారి టీచర్లు గొంతెత్తి స్పష్టం చేస్తున్నారు. ఇదంతా జెండాలూపిన మేధావుల దృష్టికి వచ్చిందా? వారేమీ మాట్లాడినట్టయితే లేదు.

నిరుద్యోగులు, వారి టీచర్లు ఇంకా కొన్ని మాటలంటున్నారు. వారు కొద్ది వారాల క్రితం ఈ సమస్యలపై అశోక్‌నగర్‌లో ఆమరణ నిరాహార దీక్షకు కూర్చున్నారు. వారికి సంఘీభావంగా నిరుద్యోగులు రాష్ట్రమంతటి నుంచి వచ్చారు. వారంతా తరచుగా వేసిన ప్రశ్న, 'ఎక్కడికి పోయారు ఈ మేధావులు? ఎందుకు మా వద్దకు రావటం లే'దని. కొత్త ప్రభుత్వం ఉద్యోగ ఖాళీలను పెంచకపోగా ఉన్నవాటికి కోత పెడుతున్నదని. బ్యాక్‌లాగ్‌లు సృష్టిస్తున్నదని. జాబ్ క్యాలెండర్ ఏమైందని. రెండు లక్షల ఉద్యోగాలు ఏ శాఖలో, ఏవి, ఎన్నున్నాయో లెక్కలు ఎందుకు ప్రకటించరని. లోక్‌సభ ఎన్నికల కోడ్ జూన్ మొదటివారంలో ముగిసినాక ఇక మిగిలే ఆరు నెలల్లో రెండు లక్షల ఉద్యోగాలు ఎట్లా భర్తీ చేస్తారని. అది ఎంత మాత్రం సాధ్యం కాదని. యూత్ డిక్లరేషన్‌లో ప్రకటించిన ప్రకారం మొదటి ఏడాదిలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు ఎట్లా నింపుతారని. అదే డిక్లరేషన్‌లో నిరుద్యోగులకు ప్రతి నెల రూ.4,000 నిరుద్యోగ భృతి హామీ ఇచ్చి, తాము అసలు అటువంటి హామీ ఇవ్వలేదంటూ అసెంబ్లీలో ఎట్లా మాట్లాడుతారని.

ఈ విషయాలు ఇంతగా రాయటం ఎందుకంటే, మేధావులు జెండాలూపింది ఈ నిరుద్యోగుల ప్రచార రథాలకే. మేధావుల చర్య వల్ల నిరుద్యోగులకు నైతిక బలం కలిగింది. వారు మునుముందు కూడా తమ వెంట నిలువగలరనే ఆశాభావం ఏర్పడింది. దానితో పట్టుదలగా ప్రచారాలు చేశారు. కాని ఈ రోజున అదే నిరుద్యోగ యువత ఆందోళన చెందుతూ, ఆ మేధావులెక్కడ అని ప్రశ్నిస్తున్నది. వాస్తవానికి ఈ మేధావులు పరిస్థితిని గమనించి తమంతట తామే ముందుకు రావలసింది. యువకులకు, ప్రభుత్వానికి మధ్య సంప్రదింపులు జరిపి సమాధానాలు వెతకాల్సింది. కాని 'అయ్యా మేధావులూ మీరెక్కడున్నా'రని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నా, వారు బయటికి రాలేదు, నిరుద్యోగులను పలకరించలేదు, ప్రభుత్వాన్ని సంప్రదించలేదు. అంతేకాదు, పైన పేర్కొన్న నిరుద్యోగుల ప్రశ్నలలో ఒక్కటంటే ఒక్కదానికైనా తమవైపు నుంచి గల ఆలోచనలేమిటో చెప్పలేదు.

> మొదట వివరించుకున్న తరహా తమ బాధ్యతలను ప్రజల విషయంలో, రాష్ట్రం విషయంలో ఈ జెండాలూపిన మేధావులు ఏ విధంగా నిర్వర్తిస్తున్నారనే దానికి ఈ విషయం బాగా అద్దం పడుతున్నది. నిజానికి విద్యారంగం గురించి, విద్యార్థుల గురించి సాధారణ రూపంలో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోనే గాక, 100 రోజుల గడువు గల 6 గ్యారెంటీల విషయంలోనూ మరికొన్ని హామీలున్నాయి. నిరుద్యోగుల గురించే నోరు విప్పని మేధావులు వాటి ప్రస్తావన చేస్తారని ఆశించలేము గనుక ఆ విషయం వదిలివేద్దాం.

సమస్య ఏమంటే, జెండాలూపిన మేధావులు గత నాలుగు నెలలుగా ప్రజలకు సంబంధించిన అసలే విషయమూ మాట్లాడినట్టు లేరు. అది 6 గ్యారెంటీలలో గల 13 హామీల అమలు కావచ్చు, మొత్తం మ్యానిఫెస్టో కావచ్చు, వీటితో నిమిత్తం లేకుండా క్షేత్రస్థాయిలో ప్రస్తుతం రైతులను తల్లడిల్లజేస్తున్న నీటి సమస్య, వారికి ఇతరత్రా కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు గురించి కావచ్చు. ప్రచార రథాలకు ఆకుపచ్చ జెండాలూపిన మేధావులు, ఎన్నికలతో తమ బాధ్యత ముగిసిందని ప్రజలకు సంబంధించిన ఇటువంటి అంశాలలో మాత్రం తమకు తాము ఎర్రజెండాలు ఊపుకుంటున్నట్టు కనిపిస్తున్నది.

రాయాలంటే చాలా ఉన్నాయి. కాని ప్రజల పట్ల మేధావుల బాధ్యత లేని తనాన్ని, నిష్క్రియాపరత్వాన్ని, పాక్షిక ధోరణులను ఎత్తిచూపే కొన్ని ముఖ్యమైన అంశాలను మాత్రం చూద్దాం. పరిస్థితిని బట్టి మరొకసారి ఇతర విషయాలు చర్చించవచ్చు. ప్రస్తుతం అన్నింటికన్న తీవ్రమైనవి రైతాంగ సమస్యలు. అధికారానికి రాగానే డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, ఆ మాటైనా ఎత్తటం లేదు. రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15,000 రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు రూ.12,000, వరికి క్వింటాలుకు రూ.500 బోనస్ అన్నవి 100 రోజుల గడువు గల 6 గ్యారెంటీలలో ఉన్నాయి. కానీ 120 రోజులు గడిచినా వీటిలో ఏ ఒక్కదాని జోలి లేకపోగా, కౌలురైతులు, వ్యవసాయ కూలీల జాబితాలు తయారుచేసే పని అయినా మొదలుపెట్టలేదు. పంట బోనస్ లేకుండానే ఖరీఫ్ గడిచిపోగా, ప్రస్తుతం యాసంగి మొదలైంది. అయినా బోనస్ ప్రస్తావన లేదు వ్యవసాయానికి సంబంధించిన మరికొన్ని సమస్యలు, అసలు రైతుభరోసా అందరికీ ఇవ్వకపోవటమే గాక ఎన్ని ఎకరాల పరిమితి విధించేదీ తేల్చకపోవటం. మరణించిన రైతుల కుటుంబాలకు రైతు బీమా ఆపివేయటం. ప్రాజెక్టులలో నీళ్లు ఉన్నచోటనైనా ఇవ్వనందువల్ల, అట్లాగే కరెంటు కోతల వల్ల 12-15 లక్షల ఎకరాలలో పంట ఎండటం. తాజాగా యాసంగి వరి కొనుగోళ్లు మొదలైనాక రైతులకు ప్రభుత్వం కనీస మద్దతు ధర ఇవ్వటంలో శ్రద్ధ వహించనందువల్ల వ్యాపారులు, అధికారులు కలిసి రైతులను పెద్ద పెట్టున మోసం చేస్తుండటం. ఇందుగురించి ఫొటోలతో సహా వార్తలు వెలువడుతున్నా నామ మాత్రపు హెచ్చరికలు తప్ప ప్రభుత్వం చలించకపోవటం. ఈ సమస్యలను తట్టుకోలేక 200 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తుండగా, అది నిజం కాదు మొదటి మూడు నెలలలో 63 మంది మాత్రమే ఆత్మహత్య చేసుకున్నారంటూ అది తమ ఘనతగా చాటడం. ఏది నిజమో తేల్చేందుకు స్వతంత్రమైన కమిటీ ఏదీ వేయకపోవటం.

జెండాలూపిన మేధావులకు ఇంత తీవ్రమైన సమస్యలు కూడా తాము నోళ్లు విప్పదగినవిగా కన్పించటం లేదు గనుక, ఇంకా మిగిలిన వాటి గురించి ప్రస్తుతానికి రాసుకోకుండా ఉండటమే మంచిది కావచ్చు. అయితే రెండు విషయాలు మాత్రం చెప్పుకోవాలి. ఇటీవల రెండు భారీ ఎన్‌కౌంటర్లలో సుమారు డజన్ మంది నక్సలైట్లు చనిపోయారు. ఇందులో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాత్ర ఉందని మావోయిస్టు పార్టీ ఆరోపించింది. అది నిజమా కాదా మనకు తెలియదు. ఘటనలు జరిగింది ఛత్తీస్‌గడ్‌లో అయినందున. కానీ విషయం అది కాదు. బీఆర్ఎస్ పాలనలో పౌరహక్కులు లేవని ఈ మేధావులు చాలా విమర్శలు చేశారు. వారి దృష్టినుంచి అది నిజమే కావచ్చు. అయితే, ఇప్పుడీ భారీ ఎన్‌కౌంటర్ల గురించి గాని, వాటిని పురస్కరించుకొని మావోయిస్టు పార్టీ రాష్ట్ర ప్రభుత్వంపై చేసిన ఆరోపణల గురించి గాని ఈ మేధావులు-కమ్-పౌరహక్కుల నేతలు ఏమైనా మాట్లాడారా? ఇది ఒకటైతే, వారికి మౌలికమైన ప్రశ్న కూడా ఒకటున్నది.

> తెలంగాణలో గాని, దేశంలో గాని పౌరహక్కుల ప్రశ్నలు, ఉద్యమాలు తలెత్తింది అసలు మొట్టమొదట ఏ పార్టీ పరిపాలనలో? ఎప్పటి నుంచి? అనేకులు పౌరహక్కుల నాయకులను, కార్యకర్తలను సైతం వేధించింది, జైళ్ల పాలు చేసింది, చివరకు ప్రాణాలు తీసింది ఏ పార్టీ పరిపాలనలో? అయినప్పటికీ ఈ జెండా మేధావులు అదే కాంగ్రెస్ పార్టీ గెలిచి వచ్చి పౌరహక్కులను కాపాడగలదని ప్రజలను నమ్మించగా, ఇప్పుడీ ఘటనలు చోటుచేసుకున్నాయి మరి. ప్రజలను గొర్రెలు చేసి కసాయికి అప్పగించటంలో మేధావుల పాత్ర చాలానే ఉంటుందని ఎప్పుడో ఎవరో అన్నట్టున్నారు.

ఇది మొదటిది కాగా రెండవ విషయం ఒకటుంది. వాస్తవానికి అది సుదీర్ఘంగా చర్చించవలసింది అయినా, ఇప్పటికి క్లుప్తంగా చెప్పుకుందాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేండ్లు గడిచింది. అదొక మైలురాయి వంటి కాల వ్యవధి. ఈ కాలంలో జరిగిందేమిటి? జరగనిదేమిటి? వాటిలో మంచి చెడు లేమిటి? రాష్ట్రం ఏర్పడక ముందు కాలంతో పోల్చితే వివిధ అభివృద్ధి, సంక్షేమ, సామాజిక రంగాల పరిస్థితి ఏమిటి? జాతీయ స్థితిగతులు, ఇతర రాష్ట్రాలు, వేరే కొత్త రాష్ట్రాలతో పోల్చితే ఏమిటి? మునుముందు ఏమి జరగటం అవసరం? అనే మౌలికమైన ప్రశ్నలపై సమగ్రమైన, నిశితమైన, అకడమిక్ అధ్యయనాలు ఏవైనా గణాంకాలు, విశ్లేషణలతో చేసి ప్రజల ముందుంచటం, ఉంచేందుకు ప్రయత్నించటం ఏదైనా ఈ కడుపులో చల్ల కదలని భద్రలోక్ మేధావులు చేస్తున్నారా? అందుకు సమాధానాలను తమ గజదంత గోపురాలలో కూర్చొని తర్కించటం గాక, క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి ఆలోచనలలో కూడా వెతకజూస్తున్నారా? లేక జెండాలూపటంతోనే తమ బాధ్యత తీరిపోయిందనుకుంటున్నారా?

నేడు అంబేద్కర్ జయంతి

భారతదేశ చరిత్ర గురించి చెప్పుకోవాల్సి వస్తే అంబేద్కర్‌కు ముందు అంబేద్కర్ తర్వాత అని చెప్పుకోకతప్పదు. ఎందుకంటే, ఎన్నో ఏండ్లుగా మన దేశంలో కొనసాగుతున్న సామాజిక అసమానతలను, వివక్షలను రూపుమాపేందుకు కృషి చేసిన మహనీయుడాయన. అందరూ సమానమనే భావనను కలిగిస్తూ, ఎవరూ చెరిపివేయలేని శాసనాన్ని రాజ్యాంగం రూపంలో లిఖించారు అంబేద్కర్. ఈ దేశాన్ని భూమిపుత్రులైన బీసీ, ఎస్సీ, ఎస్టీలు పాలించాలని.. తద్వారా స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావంతో కూడిన సామాజిక, రాజకీయ, సాంస్కృతిక పరివర్తన వస్తుందని భావించిన అంబేద్కర్ దాని కోసం ఎంతగానో శ్రమించారు.

అంబేద్కర్‌లా గొంతెత్తుదాం

పుల్లెంల గణేష్
95530 41549

అంబేద్కర్ అంటే సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, స్కాలర్‌షిప్‌లు కాదు. అంబేద్కర్ అంటే రిజర్వేషన్లు, వాటి ద్వారా ఉద్యోగాలు పొందడం కాదు. అంబేద్కర్ అంటే చైతన్య దీప్తి. 21వ శతాబ్దంలో పుట్టిన గొప్ప సంఘ సంస్కర్త అంబేద్కర్. తన విగ్రహాలు ప్రతిష్ఠించాలని, జయంతి, వర్ధంతిల పేరిట స్వీట్లు పంచాలని, వ్యక్తి పూజ చేయాలని ఆయన ఎన్నడూ కోరుకోలేదు. బహుజనులు, అణగారిన వర్గాల బతుకులు మారాలని ఆయన ఆకాంక్షించారు. అందుకోసం నిరంతరం కృషి చేశారు. అంబేద్కర్ ఆశయాన్ని సాధించాలన్నా, బడుగుల బతుకులు మారాలన్నా.. నిమ్న కులాలవారు రాజకీయాల్లోకి అడుగు పెట్టాలి.